




అందమైన వారూ, ఆజానుబాహులు, మగధీరులు, స్ఫురద్రూపులూ మాత్రమే కథా నాయకులుగా నిలిచే, నిలదొక్కుకునే - ఒకనాటి అరుదయిన తరంలో మకుటాయమానమైన నటుడు - శోభనబాబు. ఇప్పుడు హీరోకి - అలనాటి హీరోలకున్న లక్షణాలేవీ అక్కరలేదు. అందం అక్కర లేదు, చక్కని ముఖ వర్చస్సు అక్కరలేదు, భాష అసలక్కరలేదు. ఆఖరిదీ, కనీసమయినదీ - నటన బొత్తిగా అక్కరలేదు. పదిమంది మధ్య - అటూ ఇటూ గెంతే మనుషుల మధ్య - గెంతే వ్యక్తిని మనం హీరోగా గుర్తుపెట్టుకోగలం. హీరోని నేల బారు స్థాయికి, ఇంకా కిందకి లాగేసి - రోడ్డు మీద నిలబెట్టినా సరి పెట్టుకునే ప్రేక్షకులూ - వెరసి - వ్యాపారానికి వ్యావృత్తికీ చక్కని సయోధ్య ఏర్పడిన 'వింత' కాలమిది.

బాపూగారి చేతిలో - నీలమేఘశ్యాముడికి మూర్తి కట్టిన అద్భుతమయిన విగ్రహం శోభన్‌బాబుది. అలనాటి అభిమన్యుడిని కళ్ళముందు నిలపడంతో అక్కినేనితో పోటీపడ్డ లాలిత్యం ఆయనది. చాలామందికి తెరమీద నటుడిగానే తెలుసు. కానీ నాలాంటి వారికి - తెర మీదకి తర్జుమా చెయ్యగల ఏ నటుడి వ్యక్తిత్వానికీ దగ్గరగా లేని వినూత్నమైన, విలక్షణమైన వ్యక్తిత్వం శోభన్‌బాబుది. అల్లరి చేసే కాలేజీ కుర్రాడు, ఆవేశపడే అన్నయ్య, ఆరాటపడే భర్త, అందమయిన ఆఫీసరూ - మీ ఇష్టం - ఇలాంటి ఏ పాత్రలకూ లొంగని ఏకాంతమయిన, తనదయిన విభిన్నమయిన వ్యక్తి శోభన్‌బాబు. ఇది ఆయన్ని బాగా తెలిసిన నాలాంటి వారినీ దిగ్భ్రాంతుల్ని చేసే విషయం. సినిమాని ముఖాన్ని దాటి గుండెలదాకా పోనివ్వలేదు. హృదయాన్ని పూర్తిగా పూరించి నటించిన పాత్రలు ఎన్ని ఉన్నా - సినీ వాతావరణాన్ని డ్రాయింగు రూం దాటి ఇంట్లోకి అడుగుపెట్టనివ్వలేదు.

తనదైన ఓ విలక్షణమైన ప్రపంచాన్ని తొలిరోజుల నుంచీ ఏర్పరచుకుని దాన్ని చివరంటా భద్రంగా కాపాడుకున్న వ్యక్తి శోభన్‌బాబు. తన మనస్సుని, ఆలోచనల్నీ నాతో పంచుకున్నట్టు ఆయన చాలా తక్కువ మందితో పంచుకుని ఉంటారు. తొలినాటి పేదరికం,మలినాటి చిత్రాల విజయం, పిల్లలు, చుట్టూ ఏర్పరచుకున్న కందకాల ఆవరణలు, అల్లుళ్ళను ఎంపిక చేయడంలో, వ్యక్తిగత జీవితాన్ని అలంకరించుకోవడంలో, పిల్లల్ని అనునిత్యం తన కళ్ళముందు నిలుపుకోవడంలో, మొదటినించీ ఆయన ప్లానింగ్, వాటిలో ఆయన వేసుకునే ప్రణాళికలు - ఇవన్నీ మేం ఎన్నో రోజులు మాట్లాడుకునే వాళ్ళం.

నాకు తొలిరోజుల నటుడు శోభన్‌బాబు. సారథి స్టూడియోలో దుక్కిపాటితో సీను చర్చిస్తున్నప్పుడు డైలాగులు తెలుసుకోడానికి కార్ల వెనుక నుంచీ సంజ్ఞలు చేసే తొలినాటి యువనటుడు నాకింకా గుర్తున్నాడు. "ఆ రోజుల్లో మిమ్మల్ని (నన్ను, దుక్కిపాటిని) చూసి భయపడేవాడిని" అని నవ్వుతూ చెప్పేవారు.

వ్యక్తిగత జీవితంలో ఆయన కోరుకునే విలువలు వేరే ఉన్నాయి. ఆయన పెద్ద అంతర్ముఖుడు. ఎవరితోనూ కలిసేవాడు కాదు. తన ఏకాంతంలోకి తొంగిచూసే ఏ ఒకరిద్దర్నో ఆదరించి పోషించేవాడు. వాళ్ళతోనే ఆయనకి పిచ్చాపాటి. నా షికార్లు, కార్లలో ప్రయాణాలు

విని నవ్వేవాడు. ఆయనకవి సుతారమూ సాధ్యం కాని, అక్కరలేని విషయాలు.

సినిమానుంచీ విరమించుకోవాలని ఉందని ఒకసారి నాతో అన్నప్పుడు "ఇప్పుడే ఏం తొందర? అవి వచ్చే వరకు సాగనివ్వండి" అన్నాను. ఆ మాటను మనసు దాకా పోనిచ్చి మరో పదేళ్ళు నటజీవితాన్ని సాగించారు. అప్పుడు వచ్చిన చిత్రాలే - సర్పయాగం, దోషి నిర్దోషి, బలరామకృష్ణులు వంటివి. ఈ మాట నా షష్టిపూర్తి సంచికలో ఆయనే ఉటంకించారు. బలరామకృష్ణులు షూటింగు సమయంలో మా వాసు పోతే నన్ను విడవక అంటిపెట్టుకుని - అన్ని రోజులూ నాతో పాటు కన్నీరు కార్చారు. తన అనుభవాలు నా దుఃఖానికి జతచేసి బరువెక్కిన హృదయానికి ఉపశమనాన్ని పంచారు.

సభలు, సమావేశాలు, సినీమా వినోదాలు, వెర్రిమొర్రి పార్టీలకు ఆయన దూరం. పదేళ్ళు మా ఫౌండేషన్ సభలకు ఆయనను రప్పించాలని ప్రయత్నించి ఓడిపోయాను. కానీ మా వాసు పెళ్ళికి, మా మనవడి ఉపనయనానికి, మా మనవరాలి ఆరంగ్రేటానికి ముందు వరుసలో ఉన్నారు.

నా 'వ్యాపార' వ్యవహారాలకు ఆయన పెద్ద సలహాదారు. నేను ఏ ప్రాజెక్టు చేపట్టినా విధిగా వెళ్ళి చూసి వచ్చి చర్చించేవారు. మా రెండో అబ్బాయి కిట్టప్పకి ఈ విషయంలో మరింత చేరిక. ముందు ఆయన సలహాలు తీసుకునే మా అబ్బాయి ఇప్పుడాయనను మించిపోయాడనేవారు. "నేను మీ అబ్బాయి ఫ్యాన్‌ని, అయాం ప్రౌడ్ ఆఫ్ హిమ్" అనేవారు ఎప్పుడూ. టీవీలో వార్త విని కిట్టప్పకి ఫోన్ చేస్తే షాక్‌తో గావు కేక పెట్టాడు. నిన్న ఉదయమే ఆయనతో చాలా సేపు మాట్లాడటట. నిన్న సాయంకాలం వారబ్బాయితో మాట్లాడాడు. వెంటనే ఆయన ఇంటికి పరిగెత్తాడు. వాళ్ళబ్బాయి ఫోన్‌లోనే భోరుమన్నాడు. "ఉదయమే నాన్నతో మాట్లాడాను అంకుల్. ఆయన చెప్పినటల్లా చేసుకుపోయేవాడిని. ఇప్పుడూ - ఇప్పుడు -" అంటూ మాట్లాడలేకపోయాడు.

"మీరు మీ పిల్లలకు వదిలేసినట్టు నేను ఇంకా వ్యవహారాలన్నీ వదిలిపెట్టలేకపోతున్నాను" అనేవారాయన ఎప్పుడు కలిసినా. ఆడపిల్లల పెళ్ళిళ్ళను ఎంత నిర్దుష్టమైన ప్రణాళికతో జరిపారో ఆడపిల్లల తండ్రి - మా పెద్దబ్బాయికి - పదే పదే చెబుతుంటాను.

ఎప్పుడు ఇంటికి వెళ్ళినా వికసించిన మల్లెపూవులాగే కనిపించేవారు. వ్యాపార దక్షతతో జీవితాన్ని నిర్వహించుకోవడం, జీవించడంలో, నచ్చిన పుస్తకాల్ని చదువుకోవడంలో, మిత్రుల ఎంపికలో - అన్నిటిలో తనదైన బాణీని ఏర్పరచుకున్న అద్భుతమైన 'ప్లానర్' శోభన్‌బాబు.

ఆయన ఒకసారి అన్నారు: ప్రేక్షకులు తనని చూడటానికి ఇష్టపడనప్పుడు, కొత్తని ఆశించినపుడు - ఎవరికీ తెలియకుండా, తనంతటతానే నిష్క్రమిస్తానని. ఇది గొప్ప హుందాతనం, గర్వం, ఆత్మస్థైర్యం, తృప్తి, అహంకారం - అన్నీ కలబోసిన ఒక 'పరిణతి'ని సాధించిన వ్యక్తి అనగల మాట.

అనడమే కాదు - ఆ మాటను నిలబెట్టుకున్నారు శోభన్‌బాబు. ఎవరికీ తెలియకుండా సినీరంగం నుంచీ నిష్క్రమించారు. అంతేకాదు. మరొక అడుగు ముందుకు వేసి - ఎవరూ ఊహించని విధంగా - జీవితరంగం నుంచీ నిష్క్రమించారు. శోభన్‌బాబు చాలా మందికి అందాల నటుడు. కానీ నాలాంటి కొద్దిమందికి జీవితాన్ని అందంగా, అపురూపంగా, నిర్దుష్టంగా, నిరంకుశంగా అలంకరించుకున్న పరిపూర్ణ మానవుడు.